క్లుప్తంగా

అంగన్‌వాడీలో వైద్యపరీక్షలు



అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొత్తచెరువుతండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఏఎన్‌ఎం రాజమణి, వైద్యసిబ్బంది లబ్ధిదారులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్నవారికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు రక్తహీనతను నివారించేందుకు పాలు, ఆకుకూరలు, కోడి గుడ్లు ఆహారంలో ఎక్కువగా తినాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బూలి లబ్ధిదారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



ఫైజాబాద్‌లో పారుతున్న మురికినీరు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలో మురికినీరు అస్తవ్యస్తంగా పారుతోంది. గ్రామానికి వచ్చే దారి ప్రారంభంలోనే మురికినీరు పారి దుర్వాసన వస్తోంది. పైగా ఈ మురికినీరు పందులకు ఆవాసంగా మారింది. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సరైన మురికికాలువ లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మురికి కాలువ పక్కనే ప్రాథమిక పాఠశాల కూడా ఉండటంతో విద్యార్థులు అనారోగ్యాల బారిన పడే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఈ పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

9,464 దరఖాస్తుల స్వీకరణ



మాట్లాడుతున్న ఆర్డీఓ మహిపాల్

నర్సాపూర్: భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా 9,464 దరఖాస్తులు వచ్చాయని ఆర్‌డీఓ మహిపాల్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూ భారతి రెవెన్యూ సదస్సులు శుక్రవారం నాటికి పూర్తయ్యాయని చెప్పారు. కాగా నర్సాపూర్ మండలంలో 2,633 దరఖాస్తులు వచ్చాయని, కౌడిపల్లిలో 2,103, కొల్చారంలో 2,070, శివ్వంపేటలో 2,658 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఇప్పటి వరకు 5,151 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, మిగిలినవి వారం రోజుల్లో ఆన్‌లైన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

జయశంకర్‌కు నివాళి



జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): తొలి, మలి తెలంగాణ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధనం కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ అలుపెరుగని పోరాటం చేశారని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప అన్నారు. శనివారం జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా టేక్మాల్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా యువత కార్యదర్శి భాస్కర్, మాజీ ఎంపీటీసీ సిద్ధయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ విజయ్, నాయకులు రవి, శ్రీశైలం, సుబేదార్ సురేష్, నారాయణ, సాయిలు, రాజేందర్, దుర్గయ్య, మతిన్, వసీం, యాదగిరి, వసంత్ నాయక్, యాదయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దాతల కృషి అభినందనీయం

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉన్నతికి దాతలు, యువకులు కృషి చేస్తుండటం అభినందనీయమని మండల విద్యాధికారి మల్లేశం పేర్కొన్నారు. లలిత కన్‌స్ట్రక్షన్, నిర్మల్ గోల్డ్ వారి సహకారంతో మనోహరాబాద్ మండలం పాలాట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ వస్తువులను, పాఠశాలకు ఫర్నీచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, సాయికుమార్‌గౌడ్, మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



చేగుంట(తూప్రాన్): యోగా దినోత్సవంలో పాల్గొన్న ఎస్‌ఐ చైతన్యకుమార్



పెద్దశంకరంపేట(మెదక్): క్యూబ్ హైవేస్ ఆధ్వర్యంలో..



పాపన్నపేట జూనియర్ కళాశాలలో..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, ఆయా కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు యోగాసనాలు వేశారు.. ఈ సందర్భంగా యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ నిరంతర అభ్యాసంగా మార్చుకోవాలన్నారు. యోగా సాధనతో మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.



నర్సాపూర్‌లోని అల్లూరీ సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలలో..



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్ళకల్‌లో..



తూప్రాన్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో..



చిన్నశంకరంపేట(మెదక్): మోడల్‌స్కూల్‌లో..



రామాయంపేట: పోలీసులు, డాక్టర్ల యోగా



రామాయంపేట: జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులతో ఆసనాలు వేస్తున్న డీఈఓ రాధాకిషన్



నర్సాపూర్: యోగాసనాలు వేస్తున్న జడ్జి, పోలీసులు, న్యాయవాదులు

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు



రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని కొండాపూర్, కాగజ్ మద్దూర్, నత్నయ్యపల్లి రోడ్డుకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సొంత నిధులతో శనివారం మరమ్మతులు చేయించారు. గత కొన్ని నెలలుగా నర్సాపూర్‌- హైదరాబాద్ 765డీ జాతీయ రహదారి నుంచి కొండాపూర్, కాగజ్‌మద్దూర్, నత్నయ్యపల్లి మీదుగా ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో కొన్ని నెలలుగా బస్సులు రద్దు చేశారు. దీంతో పై మూడు గ్రామాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఆటోలను ఆశ్రయించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి సొంత నిధులతో గుంతలకు మరమ్మతులు చేయించారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో మాట్లాడి వెంటనే బస్సులను పునరుద్ధరించాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ చెక్కులను జెడ్పీ మాజీ చైర్మన్ ర్యాకల హేమలత శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్యంతో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన నాచారం నర్సింహులు, సాయియాదవ్, కాళ్ళకల్‌కు చెందిన నర్సోజీ, రామాయపల్లికి చెందిన మర్కంటి బాబుకు రూ.60 వేల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పురం రవి, రవికుమార్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, ఆత్మ డైరెక్టర్ భిక్షపతి, కుమార్‌యాదవ్, శైలేందర్, సుధాకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ హేమలత

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించండి

రామాయంపేట(మెదక్): పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలని ప్రభుత్వ పాఠశాలల్లో వంటచేసే కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఎంఈఓ కార్యాలయానికి చేరుకొని తమ బాధలు మొరపెట్టుకున్నారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో అప్పులు చేసి స్కూళ్లలో వంట చేస్తున్నామని వాపోయారు. ఈమేరకు సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి ఆధ్వర్యంలో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.



ఎంఈఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

సంక్షిప్త వార్తలు

◆ **సామూహిక అక్షరాభ్యాసం**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో 9 మంది చిన్నారి విద్యార్థులకు శనివారం అక్షరాభ్యాసం నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేహతాబ్ బేగం తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, ఏఎన్‌ఎం రాధ, వీనా, టీచర్ అనిత పాల్గొన్నారు.

◆ **ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం**

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కోళపల్లి, వీరోజిపల్లి, బద్దారం, శివాయిపల్లి తదితర గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ, హౌసింగ్ ఏఈ ప్రియ శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇళ్ల పనులను వెంటవెంటనే పూర్తిచేస్తే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ కార్యదర్శులు గీత, సవిత తదితరులు పాల్గొన్నారు.

◆ **మానవ హక్కులపై అవగాహన**



హవేళిఘణాపూర్(మెదక్): నేరం జరిగిన వెంటనే పోలీసులు తయారు చేసే ఎఫ్‌ఐఆర్ రిపోర్టును ప్రతి పౌరుడు పొందేందుకు హక్కు ఉంటుందని అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సిద్దిరాములు అన్నారు. మండల పరిధిలోని బ్యాతోల్ జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ నీలిమ ఆదేశాల మేరకు గ్రామంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయ ప్రక్రియలో ఎఫ్ఐఆర్ మొదటి మెట్టు అన్నారు. అనంతరావు, భరోసా సెంటర్ సిబ్బంది సౌమ్య, యాదగిరి తదితరులు ఉన్నారు.

◆ **దుర్గామాతకు ప్రత్యేక పూజలు**

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బి.తిమ్మాయిపల్లిలో శనివారం జరిగిన దుర్గామాత దేవాలయ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పరుశురామ్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, అక్బర్, శ్రీనివాస్, అదిల్‌పాషా, రిజ్వాన్, సాయిబాబ పాల్గొన్నారు.

◆ **నిబంధనలు తప్పనిసరి**

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఏఎస్‌ఐ శేఖర్ సూచించారు. మిరుదొడ్డిలో శనివారం ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. విధిగా హెల్మెట్‌ను ధరించాలని, మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సౌండ్ సిస్టం వితరణ



చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట జెడ్పీ పాఠశాలకు 1997–98 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు రూ.20 వేల విలువైన డిజిటల్ సౌండ్ సిస్టంను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు వేణుగోపాల్ సత్కరించారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

నర్సాపూర్: ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనల మేరకు వసతులు కల్పించాలని ఎంఈఓ తారాసింగ్ పాఠశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు. శనివారం తన కార్యాలయంలో వారితో సమావేశం నిర్వహించారు. మెరుగైన వసతులు కల్పించాలని, అధిక ఫీజులు వసూలు చేయొద్దన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

శివ్వంపేట(నర్సాపూర్): అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తామని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కొంతన్‌పల్లి, పోతులబోగూడ, టొర్య, బంజారా తండాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చేయని అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాధవరెడ్డి, నవీన్‌గుప్తా, వేణుగోపాల్‌రెడ్డి, శరబయ్య, అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

మంత్రికి వెంకటయ్య సన్మానం



మంత్రి లక్ష్మణ్‌కు బొకే అందిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర దళిత, గిరిజన దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ శనివారం హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. దళితబంధు పథకానికి నిధులు విడుదల చేయాలని కోరారు.

తండాల అభివృద్ధికి కేంద్రం కృషి

చిన్నశంకరంపేట(మెదక్): గిరిజన తండాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ధర్తి ఆభా జనభాగిదారి అభియాన్ పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. శనివారం మండలంలోని కామారంతండాలో నిర్వహించిన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం సంక్షేమ పథకాలతో పాటు వ్యక్తి అభివృద్ధి పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. పథకాలను పొందేందుకు అవసరమైన దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల గిరిజన అభివృద్ధి అధికారి దర్శన్, గ్రామ కార్యదర్శి స్వర్ణలత, నాయకులు మోహన్‌నాయక్, స్వామినాయక్, మాజీ ఎంపీటీసీ మంగ్యా, మాజీ సర్పంచ్ లక్ష్మిరాములు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

పేదల సొంతింటి కల సాకారం



ఇంటి పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఇందిరమ్మ ఇంటితో పేదల సొంతింటి కల నెరవేతుందని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని భుజిరంపేట, వెంకటాపూర్, ధర్మాసాగర్, రాయిలాపూర్, ముట్రాజ్‌పల్లి, వెంక్రటావ్‌పేట, తునికి గ్రామాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇంటి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పేదలకు ఇండ్లు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సున్నం సతీష్, తునికి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ పాష, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు తహసీల్దార్ మన్నన్ ప్రతిభ పురస్కారాలు అందజేశారు. పదవ తరగతిలో టాపర్స్‌గా నిలిచిన కావేరి, వైష్ణవి, ఇంటర్మీడియెట్ టాపర్స్‌గా నిలిచిన విక్రమ్, పియూష్ కుమార్, కావ్య, కీర్తన, సృజన, లక్ష్మిప్రసన్న, నిహారికను తహసీల్దార్ సన్మానించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. అలాగే ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన పది మంది విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వాణికుమారి, ఎంఈఓ పుష్పవేణి పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న తహసీల్దార్ మన్నన్

11 కేవీ తీగలపై పడిన మరో విద్యుత్ తీగ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గంగారం సబ్‌స్టేషన్ నుంచి అజ్జమర్రి గ్రామానికి ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలపై, బోర్‌మోటార్‌లకు విద్యుత్ సరఫరా అయ్యే మరో తీగ తెగి పడింది. దీంతో ప్రమాదకరంగా మారింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నగేశ్‌యాదవ్ మాట్లాడుతూ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు శనివారం ఫోన్ చేయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సరైన విద్యుత్ సేవలు అందించలేని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ప్రమాదకరంగా మారిని విద్యుత్ తీగలు

సమయపాలన పాటించడం తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ శంకర్

ఎంఈఓ శంకర్

హవేళిఘణాపూర్(మెదక్): ఉపాధ్యాయులు సమయపాల పాటించి విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని మెదక్ ఎంఈఓ శంకర్ సూచించారు. మండల పరిధిలోని ర్యాలమడుగు, చిట్యాల పాఠశాలలను శనివారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల హాజరు రికార్డులు పరిశీలించారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

సన్నబియ్యం.. నాణ్యతా లోపం

వెల్దుర్తి(తూప్రాన్): వానాకాలం సీజన్‌లో రేషన్ లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తుంది. అందులో భాగంగా శనివారం చెర్లపల్లిలోని ఓ రేషన్ దుకాణంలో సరఫరా చేసిన సన్నబియ్యం నాణ్యతగా లేవని లబ్ధిదారులు వాపోయారు. చెత్తా, చెదారంతో పాటు ఇతర ప్లాస్టిక్ వస్తువులు దర్శనమిచ్చాయని, వాటిని తినేదెలా అంటూ ప్రశ్నించారు. నాణ్యతతో కూడిన సన్నబియ్యం మాత్రమే పంపిణీ చేయాలని కోరారు.



డ్రగ్స్‌ను అడ్డుకోవడం అందరి బాధ్యత

ఏసీపీ సదానందం

హుస్నాబాద్: ప్రతి ఒక్క మహిళ డ్రగ్స్‌ను అడ్డుకోవడం తన బాధ్యతగా చూడాలని, ఇంటిని, ఊరును కాపాడుకున్నప్పుడే ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందని ఏసీపీ సదానందం సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర ముగింపు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ గ్రామాల్లో విస్తరించిన డ్రగ్స్, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌పై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్డీఓ రామ్మూర్తి మాట్లాడుతూ యువత నైతిక విలువలతో ఆదర్శంగా ఉండాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ లక్ష్మారెడ్డి, కో-ఆర్డినేటర్లు వీరన్న, సారయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు రవీందర్, ప్రకాశ్, కుమారస్వామి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక డంప్ చేసిన ఇద్దరిపై కేసు

కొండపాక(గజ్వేల్): అక్రమంగా ఇసుకను డంప్ చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ ఎస్సై మల్లేశం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ శివారులో రాసుల మల్లయ్య, కుసుమ మోతయ్య కొంత కాలంగా నంగునూరు మండల శివారులోంచి ఇసుకను ట్రాక్టర్లతో తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. గ్రామం చుట్టు ప్రక్కల వారికి అధిక ధరలకు అమ్ముతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి తనిఖీ చేయగా 2 చోట్ల సుమారు 50 టన్నుల ఇసుకను ఇండ్ల మధ్య చెట్లచాటున డంప్ చేసినట్లు గుర్తించి సీజ్ చేశారు.



అంకిరెడ్డిపల్లిలో అక్రమ ఇసుక డంప్‌లను సీజ్ చేస్తున్న ఎస్సై మల్లేశం